# పంచాయతీ చిన్నది.. అభివృద్ధి గొప్పది

- రూ 8.5 కోట్లతో భీమ్లాతండా గ్రామాభివృద్ధి
- గ్రామస్తుల హర్షం

చివ్వెంల, డిసెంబర్ 3 : మండలంలోని భీమ్లా తండా ఒకప్పుడు బండమీది చందుపట్ల ఉమ్మడి గ్రామ పంచాయతీలో భాగంగా ఉండడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. తండా మొత్తం సమస్యల నిలయమే. వానొస్తే ప్రధాన రహదారితో పాటు వీధులన్నీ చిత్తడిగా మారేవి. డ్రైనేజీలు పొంగి వీధుల్లో మురుగునీరు పారేది. అయితే ఇదంతా గతం. స్వరాష్ట్రంలో భీమ్లాతండా ప్రత్యేక గ్రామ పంచాయతీగా అవతరించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో పల్లె రూపురేఖలు పూర్తిగా మారాయి. సీసీ రోడ్లు, మిషన్ భగీరథతో ఇంటింటికి తాగునీరు, పల్లె ప్రకృతి వనంతో పచ్చదనం పెంపు, ఎల్ఈడీ లైట్లు ఇలా ప్రతి మౌలిక సౌకర్యాలను సంతరించుకుని అభివృద్ధిలో పరుగులు తీస్తూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు ఉత్సాహంగా పని చేసి ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దారు.



మన ఊరు-మన బడిలో సుందరంగా మారిన భీమ్లాతండా ప్రాథమిక పాఠశాల

### గ్రామ జనాభా..

భీమ్లాతండాలో మొత్తం 410 మంది జనాభా, 105 నివాసాలు, 310 మంది ఓటర్లు ఉన్నారు. గత సంవత్సరం వంద శాతం ఇంటి పన్ను వసూళ్లు చేసి ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ ఏడాది సైతం పన్ను వసూళ్లలో ఇప్పటికే అధికారులు 60 శాతం వసూలు చేసి వంద శాతం దిశగా ముందుకు సాగుతున్నారు.


గ్రామంలో వేసిన సీసీ రోడ్లు

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు..

ఒకప్పుడు తాగునీటి కోసం గ్రామ మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుని తాగేవారు. ఈ వ్యయప్రయాసాలను తీరుస్తూ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నది. తండాలో ఒకప్పుడు ఒరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ లైన్లు దర్శనమివ్వగా నేడు వారంటిని నూతనంగా ఏర్పాటు చేసి నిరంతరం నాణ్యమైన 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఎల్ఈడీ లైట్లతో వీధులన్నీ కాంతివంతంగా కనిపిస్తున్నాయి.

### తండాలో జరిగిన అభివృద్ధి పనులు..

- మన ఊరు-మన బడి కార్యక్రమం కింద రూ.11.90 లక్షలతో పాఠశాలల ప్రహరీ నిర్మాణాలు
- రూ.27.50 లక్షలతో అంగన్‌వాడీ నిర్మాణం
- రూ 1.10 కోట్లతో సీసీ రోడ్లు
- రూ.1.58 కోట్లతో బీటీ రోడ్లు
- రూ.27 లక్షలతో మిషన్ కాకతీయ పనులు
- రూ.5.16 లక్షలతో పల్లె ప్రకృతి వనాలు
- రూ.12.37 లక్షలతో వైకుంఠ ధామం
- రూ.3 లక్షలతో సెగ్రిగేషన్ షెడ్డు
- రూ.10 లక్షలతో గ్రామ పంచాయతీ ట్రాక్టర్
- రూ.66,96,888తో 46 మందికి ఆసరా పింఛన్లు
- రూ.50.89 లక్షలతో 153 మందికి రైతు రుణ మాఫీ
- రూ.2,85,22,920తో 294 మందికి రైతు బంధు
- ఇద్దరికి రైతు బీమా రూ.10 లక్షలు
- వ్యవసాయ యాంత్రీకరణకు ఏడుగురికి రూ.2,47లక్షలు
- స్వయం సహాయక సంఘాల ద్వారా 10 మందికి రుణాలు రూ.26.40 లక్షలు
- వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణం 62 కుటుంబాలకు రూ.7.44 లక్షలు
- కల్యాణలక్ష్మి పథకం ద్వారా 156 మందికి రూ.1,40,18,096
- కేసీఆర్ కిట్ ద్వారా 12 మందికి రూ. 1.50 లక్షలు
- సీఎం సహాయ నిధి ద్వారా ఐదుగురికి రూ.3 లక్షలు


మిషన్ భగీరథ మంచినీటి ట్యాంక్

### మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో గ్రామం అభివృద్ధి



మా తండా గతంలో ఉమ్మడి గ్రామ పంచాయతీలో భాగంగా ఉండేది. కొత్త గ్రామ పంచాయతీగా మారిన తర్వాత రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సహాయ సహకారాలతో అన్ని విధాలుగా అభివృద్ధిలో తీర్చిదిద్దుకుంటున్నాం. ప్రభుత్వం తలపెట్టిన అన్ని కార్యక్రమాలు సద్వినియోగం చేసుకుంటూ గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటున్నాం. పచ్చదనం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాం. ప్రజలు, అధికారుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– ధరావత్ హముడా, సర్పంచ్, భీమ్లాతండా

### మా తండా రూపు రేఖలు మారినయ్



మా తండా గతంలో అయితే చందుపట్ల గ్రామ పరిధిలో ఉండేది. ఏ చిన్న అవసరం వచ్చినా 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న చందుపట్లకు నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. కొత్త గ్రామ పంచాయతీగా మారినంక సర్పంచ్‌తో పాటు అధికారులు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. మా తండాలో గతంలో ఏ ఒక్క బజారు చూద్దామన్నా మంచిగ లేకుండె. ఇప్పుడు అన్ని వీధుల్లో సీసీ రోడ్లు పడ్డయ్. శిథిలావస్థలో ఉన్న బడి కొత్తగా కట్టించి, ఆటల కోసం స్థలం కేటాయించారు. బిందెలతో బాయిల కాడకు పొయ్యే పని లేదు. చాలా సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్ సార్, మంత్రి జగదీశ్‌రెడ్డి సారు మా తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా మార్చి తండా రూపు రేఖలు మార్చారు. వారికి తామంతా జీవితాంతం రుణపడి ఉంటాం.

– ధరావత్ భాస్కర్, గ్రామస్తుడు, భీమ్లాతండా

## జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 3 : జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. కలెక్టర్ ఎస్. వెంకట్రావ్‌తో కలిసి ఆదివారం కౌంటింగ్ పర్యవేక్షణ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖకు సహకరించిన ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు జిల్లా పోలీస్ శాఖ పటిష్ట ప్రణాళికతో పని చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు కల్పించినట్లు చెప్పారు. ఎన్నికల బందోబస్తులో నిత్యం శ్రమించి పని చేసిన జిల్లా పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ఎవరూ చట్ట ఉల్లంఘన చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

## 17 మంది అభ్యర్థుల డిపాజిట్ గల్లంతు

- ప్రధాన పార్టీల అభ్యర్థులకు మాత్రమే దక్కిన డిపాజిట్
- బీఎస్పీకి వచ్చిన ఓట్లు అంతంత మాత్రమే

బొడ్రాయిబజార్, డిసెంబర్ 3 : సూర్యాపేట అసెంబ్లీ ఎన్నికల బరిలో మొత్తం 20 మంది అభ్యర్థులు నిలిచారు. కాగా ఆదివారం వెల్లడైన ఫలితాల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మినహా ఇతర పార్టీల అభ్యర్థుల డిపాజిట్ గల్లంతయ్యింది. పోలైన ఓట్లు 2,06,684 ఉండగా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి 1/6 ఓట్లు అంటే 40 వేలకు పైగా సాధించాల్సి ఉన్నది. బీఆర్ఎస్ 75,143, కాంగ్రెస్ 70,537, బీజేపీ 40,407 ఓట్లతో డిపాజిట్ దక్కించుకోగా మిగిలిన 17 మంది అభ్యర్థులు తమ డిపాజిట్లను కోల్పోయారు. ప్రధాన పార్టీలకు గట్టి పోటీని ఇస్తుందనుకున్న బీఎస్పీ 13,907 ఓట్లు మాత్రమే సాధించి డిపాజిట్‌ను కోల్పోయింది. అలాగే చెరుకు కిరణ్‌కుమార్ 399, వంగపల్లి కిరణ్ 74, తరాల ఆంజనేయులు 73, పల్లేటి రమేశ్ 71, వరికుప్పల వెంకన్న 119, లింగిడి వెంకటేశ్వర్లు 231, రాజశేఖర్ 219, కొత్తపల్లి రేణుక 183, చామకూరి నర్సయ్య 391, ధరావత్ వెంకటేశ్ 542, లింగయ్య 482, మల్రెడ్డి నెహెమ్యా 1,071, మారం వెంకట్‌రెడ్డి 961, లింగారెడ్డి 260, కందుల మురళి 677, యాతాకుల ఈశ్వర్ 177 ఓట్లు మాత్రమే సాధించి డిపాజిట్లను కోల్పోయారు. కాగా ఈసారి ఎన్నికల్లో 760 మంది నోటాకు ఓటేశారు.

## దైవకార్యాలు అంకితభావంతో చేస్తే ఉత్తమ ఫలితాలు

- సిద్ధగురు రమణానంద మహర్షి

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 3 : దైవ కార్యాలు అంకితభావంతో చేస్తే ఉత్తమ ఫలితాలు చేకూరుతాయని సిద్ధగురు రమణానందమహర్షి భక్తులకు ప్రబోధించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో కొనసాగుతున్న దశమహా భైరవులకు, 18తాంత్రిక గురువుల శివలింగాలకు 36రకాల విశేష ద్రవ్యాలతో ఆదివారం పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ, మహాన్నదానం చేశారు.


అభిషేకం చేస్తున్న సిద్ధగురు రమణానందమహర్షి

## కారు చోరీ

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 3 : రోజు మాదిరిగా ఇంటి ముందు నిలిపిన కారును అపహరించుకుపోయిన ఘటన పట్టణ పరిధిలోని రాయగిరిలో శనివారం జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొల్లేపల్లికి చెందిన సరికొండ ఆంజనేయులు ఏపీ03 ఏక్యూ5504 నంబర్ గల ఈకో కారును రోజు మాదిరిగానే ఇంటి ఆవరణలో నిలిపి స్వగ్రామమైన బొల్లేపల్లికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. శనివారం ఉదయం11 గంటల సమయంలో దుండగులు కారును దొంగిలించుకుపోయారు. చోరీకి గురైన కారు, కారులోని సామగ్రి విలువ రూ.4లక్షల వరకు ఉంటుందని, భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.



చోరీకి గురైన కారు (ఫైల్)

## ఇక సాఫీగా ప్రయాణం

- యాదగిరిగుట్ట - చేర్యాల డబుల్ రోడ్డు పనులు పూర్తి

రాజాపేట, డిసెంబర్ 3 : యాదగిరిగుట్ట నుంచి రాజాపేటకు డబుల్ రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. దీంతో ఇకపై ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పాయి. యాదగిరిగుట్ట నుంచి రాజాపేట మీదుగా చేర్యాల వైపు డబుల్ రోడ్డుకు రూ.8.50 కోట్లు మంజూరయ్యాయి. దాంతో 29 కిలో మీటర్ల మేరకు డబుల్ రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు. గుంతలమయమైన రోడ్డు పునరుద్ధరణతో ప్రజలకు ప్రయాణం సాఫీగా కొనసాగిస్తున్నారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్త చేస్తున్నారు.